ఈ రోడ్డు బాధ్యత నారాయణుడిదే.!

కంకర తేలిన మహదేవ మంగళం రోడ్డు

ప్రజాశక్తి-గంగాధరనెల్లూరు: మండలంలోని మహదేవమంగళం చెరువు కట్టపై తారురోడ్డు ధ్వంసమై కంకర రాళ్ల తేలిపోయాయి. దీంతో ఈ రోడ్డుపై ప్రయాణాలు సాగిస్తున్న వాహన దారులకు అవస్థలు తప్పడం లేదు. మండలంలో చిన్న వేపంజేరి, మహదేవమంగళం, తిరువిది కుప్పం, కడపగుంట, పంచాయతీలకు చెందిన ప్రజలు ఈ దారిగుండానే రాకపోకలు సాగించాలి. ప్రధానంగా మహాదేవమంగళం చెరువు కట్టపై వెళ్లాల్సిందే. ఈ చెరువు కట్టపై ఉన్న తారు రోడ్డు ధ్వంసమై గుంతలు ఏర్పడి కంకరరాళ్ళు తేలిపోయాయి. చిత్తూరు-తిరువిదికుప్పం ఆర్టీసీ బస్సు సైతం ఈ రహదారిలోనే రాకపోకలు సాగిస్తుండేది. వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నాలుగున్నర సంవత్సరమైన ధ్వంసమైన ఈ తారు రోడ్డును పట్టించుకునేవారు కరువయ్యారని పలువురు వాహనదారులు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, డిప్యూటీ సీఎం నారాయణస్వామి స్పందించి తారు రోడ్డు వేయించాలని ప్రజలు కోరుతున్నారు.

విశ్రమమెరుగని పోరు

ప్రభుత్వం మొండి వైఖరి మానుకోవాలి

- కార్మిక సంఘాల రాస్తారోకో

ప్రజాశక్తి-చిత్తూరుఅర్బన్: కార్మిక సంఘాలు చేపడుతున్న సమ్మె పట్ల ప్రభుత్వం సానుకూలంగా స్పందించి డిమాండ్‌లు పరిష్కరించాలని ప్రజాసంఘ నేతలు డిమాండ్ చేశారు. శనివారం చిత్తూరు నగరంలో మ్యాక్స్ షాపింగ్ మాల్ జంక్షన్ వద్ద పెద్ద ఎత్తున రాస్తారోకో నిర్వహించారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.సురేంద్రన్, ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి సురేంద్రనాథ్, ఏటీసీ జిల్లా నాయకులు దాసరి చంద్రలు మాట్లాడుతూ 40 రోజులుగా అంగన్వాడీలు సమ్మె చేస్తున్నప్పటికీ ప్రభుత్వం మొండి వైఖరిని ప్రదర్శించడం దారుణమన్నారు. ప్రజాస్వామ్య దేశంలో సమ్మెలు చేయడం సహజమన్నారు. పెరిగిన నిత్యావసరాల ధరలతో అంగన్వాడీలు, కార్మికులు చాలీచాలని వేతనాలతో ఎలా జీవిచాలంటూ ఆందోళన వ్యక్తం చేశారు. సానుకూలంగా డిమాండ్‌లను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తే పెడచెవిన పెట్టడమే కాకుండా ఇబ్బందులు పెట్టి భయ భ్రాంతులకు గురిచేయాలనుకోవడం ఎంతవరకు సమజసం అని ప్రశ్నించారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం దిగొచ్చి డిమాండ్‌లను నెరవేర్చాలని కోరారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు లోకయ్య, చిట్టెమ్మ, వీరప్ప, అర్జున్, గుర్రప్ప, ఏఐటీయూసీ నాయకులు రమాదేవి, సుబ్రహ్మణ్యం, ఈశ్వర్, రఘు, జయశంకర్, ఐఎఫ్‌టియు నాయకులు ఆశీర్వాదం తదితరులు పాల్గొన్నారు.

బెదిరింపులకు తలొగ్గం

ప్రజాశక్తి-వికోట: సమ్మె ఆపించేందుకు ప్రభుత్వం బెదిరింపులకు పాల్పడినా డిమాండ్‌లు నెరవేర్చేందాకా సమ్మె విరమించేది లేదని అంగన్వాడీలు స్పష్టం చేశారు. శనివారం వికోట రెవెన్యూ కార్యాలయ ప్రాంగణంలో 40వ రోజున నిరసన దీక్ష చేపట్టారు. టెర్మినేషన్ పేరుతో ప్రభుత్వం బెదిరింపులకు పాల్పడుతుండటం దారుణమని బైరెడ్డిపల్లి ప్రాజెక్టు యూనియన్ నాయకులు శ్యామల అన్నారు. ఆమె మాట్లాడుతూ న్యాయమైన డిమాండ్‌లపై సమ్మె చేస్తుంటే భగ్నం చేసేందుకు ప్రభుత్వం నోటీసులు, టెర్మినేషన్ అంటూ భయభ్రాంతులకు గురిచేయాలనుకోవడం సరికాదన్నారు. ఎట్టి పరిస్థితిల్లో భయపడే ప్రసక్తే లేదని ఆమె స్పష్టం చేశారు. యూనియన్ నేతలు నాగభూషణం, అనిత పాల్గొన్నారు.

పలమనేరులో రాస్తారోకో

- డిమాండ్‌లు పరిష్కరించాలంటూ పెద్దఎత్తున నినాదాలు
- బెదిరింపులు మానుకొని.. పరిష్కారం చూపాలని డిమాండ్

ప్రజాశక్తి-పలమనేరు: ప్రధాన డిమాండ్‌లు నెరవేర్చాలని తాము చేస్తున్న పోరాటంలో న్యాయముందని అంగన్వాడీలు అన్నారు. శనివారం పలమనేరులో భారీ ఎత్తున రాస్తారోకో నిర్వహించారు. ఐసీడీఎస్ కార్యాలయం నుంచి అంబేద్కర్ సర్కిల్ వరకు ర్యాలీ చేపట్టారు. అంగన్వాడీ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షులు వాడ గంగరాజు, పట్టణ అధ్యక్షులు గిరిధర్ గుప్తా, నాయకులు ఓబుల్‌రాజు ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహించారు. అంగన్వాడీల నిరసన దీక్షలపై ప్రభుత్వం మొండి వైఖరిని వీడి పరిష్కరించాలని డిమాండ్ చేశారు. 40రోజులుగా సమ్మె చేస్తుంటే ఎస్మా ప్రయోగించడం, బెదించడం వంటి చర్యలకు పాల్పడడం బాధాకరమన్నారు. ఇకనైనా చర్చలకు పిలిచి డిమాండ్‌లకు పరిష్కారం చూపాలని కోరారు.

'పోలీస్ గ్రౌండ్' శుభారంభం

పోలీస్ గ్రౌండ్ ప్రారంభిస్తున్న కలెక్టర్, ఎస్పీ

- చిత్తూరు కేంద్రంగా ఏర్పాటైన నూతన పోలీస్ గ్రౌండ్
- రిబ్బన్ కట్ చేసి ప్రారంభించిన జిల్లా కలెక్టర్
- కలెక్టర్, ఎస్పీ జట్ల మధ్య తొలి క్రికెట్ మ్యాచ్

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరంలో నూతనంగా పోలీస్ గ్రౌండ్స్ నిర్మించారు. జిల్లా పోలీస్ ట్రైనింగ్ గ్రౌండ్స్ పక్కనే గ్రౌండ్ పనులు పూర్తి చేసి అందుబాటులోకి తీసుకొచ్చారు. శనివారం కలెక్టర్ షన్మోహన్, ఎస్పీ రిశాంత్‌రెడ్డి చేతుల మీదుగా గ్రౌండ్‌ను రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తక్కువ సమయంలో పెద్ద మైదానం నిర్మించడానికి కృషి చేసిన జిల్లా ఎస్పీ అభినందించారు. ఎస్పీ మాట్లాడుతూ కేవలం పోలీసులకే కాకుండా మీడియా, సామాన్య ప్రజలకు ఉపయోగపడేలా అన్ని సౌకర్యాలు కల్పిస్తామని పేర్కొన్నారు. గత కలెక్టర్ హరినారాయణ, ప్రస్తుత కలెక్టర్ షన్మోహన్ సహకారంతో మైదానం ఏర్పాటైందని సంతోషం వ్యక్తం చేశారు. క్రీడా మైదానం నిర్మించడానికి కృషి చేసిన పోలీసు అధికారులకు, సిబ్బందికి అభినందిస్తూ ప్రశంసా పత్రాలు అందజేసారు. అనంతరం క్రీడా మైదానంలో జిల్లా కలెక్టర్ జట్టు, ఎస్పీ జట్ల మధ్య తొలి క్రికెట్ పోటీలు జరిగాయి. హోరాహోరీగా జరిగిన మ్యాచ్‌లో ఎస్పీ జట్టు విజేతలుగా నిలిచారు. వారికి మోమెంటో అందజేశారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీలు సుధాకర్, శ్రీలక్ష్మీ, నాగేశ్వర రావు, ఎస్.బి. డి.ఎస్.పి. శ్రీనివాస రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రత ఎంతో ప్రాముఖ్యం

ప్రజాశక్తి-చిత్తూరుఅర్బన్: రోడ్డు భద్రత ఎంతో ప్రాముఖ్యమని, జిల్లా అంతటా విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ షన్మోహన్ అధికారులను ఆదేశించారు. శనివారం పోలీస్ గ్రౌండ్స్‌లో ఎస్పీ రిశాంత్‌రెడ్డితో కలిసి రహదారి భద్రత మాసోత్సవాలకు సంబంధించిన గోడపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 20వ తేదీ నుండి ఫిబ్రవరి 19 వరకు మాసోత్సవాలు నిర్వహించేందుకు నిర్ణయం తీసుకుందన్నారు. యువతకు రహదారి భద్రతపై సాంకేతికంగా అవగాహన కల్పించుట ప్రధాన ఉద్దేశ్యమని, దానికి సంబంధించి ప్రభుత్వం కార్యాచరణ ప్రణాళికను నిర్ధేశించారనాన్నరు. ఇందుకు బ్యానర్లు, గోడపత్రికలు, కరపత్రాలను తయారు చేయడం జరిగిందన్నారు. ఇందుకు అనుగుణంగా రహదారి భద్రతపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఉపరవాణా కమీషనర్ నిరంజన్ రెడ్డి, సంబంధిత అధికారులు, పాల్గొన్నారు.

సమిష్టి కృషితో రెడ్ క్రాస్ సభ్యత్వం పెంపు

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: స్థానిక పలమనేర్ రోడ్ లోని నూతనంగా నిర్మిస్తున్న జిల్లా రెడ్ క్రాస్ భవనంలో శనివారం సాయంత్రం రెడ్ క్రాస్ జిల్లా మేనేజింగ్ కమిటీ సమావేశం చైర్మన్ వి.రమేష్ బాబు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రెడ్‌క్రాస్ సంస్థలో పాట్రన్ సభ్యత్వం, శాశ్వత సభ్యత్వం కోసం సమిష్టిగా కృషి చేద్దామని కమిటీ సభ్యులకు తెలియజేశారు. జిల్లాలో పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులకు రెడ్‌క్రాస్ సేవలు గురించి జూనియర్, యువజన రెడ్‌క్రాస్ కమిటీల ఏర్పాటుపైన, రక్తదానాలపైన అవగాహన కల్పించి విస్తృత సేవలు అందించాలని కార్యాలయ సిబ్బందికి తెలియజేశారు. నూతన భవన నిర్మాణ పనులు పరిశీలించారు. సమావేశంలో పాట్రన్ మెంబర్స్‌గా నమోదైన బాలాజీ హేచరీస్ యండి. ప్రణీత్ కుమార్. ఎంవి కేశవరెడ్డి మెమోరియల్ ఫౌండేషన్ ప్రెసిడెంట్ ఎంవిశ్రీధర్ రెడ్డి, రెడ్‌క్రాస్ కార్యదర్శి సహదేవనాయుడును ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ కట్టమంచి గోవర్ధన్ బాబి, మెంబర్స్ రెడ్డప్ప, మురుగేషన్ ఎమ్.ఆర్.అరుణకుమారి, కృష్ణమూర్తిరెడ్డి, పాపిరెడ్డి, నంబికరాజ్ సిబ్బంది, గోపి, చిరంజీవి, కుమార్ పాల్గొన్నారు.

అన్ని రంగాల్లో విద్యార్థులు ముందుండాలి: జెడ్పీ చైర్మన్

కార్యక్రమంలో మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్

ప్రజాశక్తి-వికోట: విద్యార్థులు చదువుతోపాటు అన్ని రంగాల్లో ముందు కెళ్లాలని జడ్పీ చైర్మన్ శ్రీనివాసులు పిలుపు నిచ్చారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులతో పాటు ప్రైవేటు పాఠశాలల్లో చదివే విద్యార్థులకు కూడా ప్రభుత్వం అమ్మఒడి అందిస్తోందని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని విద్యార్థులు ముందుకెళ్లాలని సూచించారు. మారుతున్న కాలానికి అనుగుణంగా విద్యార్థులు చదువుతోపాటు కళల్లో కూడా రాణించాలని ప్రముఖ సినీ నటుడు కోట శంకర్రావు పిలుపునిచ్చారు. వీకోటలో శనివారం నిర్వహించిన రాగశ్రీ దివ్యజ్ఞాన పాఠశాల పదవ వార్షికోత్సవానికి వారు ముఖ్యఅతిథిలుగా విచ్చేశారు. వారు మాట్లాడుతూ విద్యతోనే ఉన్నత శిఖరాలు సాధ్యమవుతాయని దానికి తోడు అన్ని రంగాల్లోనూ విద్యార్థులు ముందుకెళ్లేలా తల్లిదండ్రులు ప్రోత్సహించాలని సూచించారు. మారుమూల ప్రాంతమైన వి.కోటలో విద్యారంగం దినదినాభివృద్ధి చెందుతోందని దీనికి సహకరిస్తున్న యాజమాన్యాన్ని అభినందించారు. ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని వాటి సాధన కోసం పాటుపడాలని కుప్పం ద్రావిడ విశ్వవిద్యాలయం మాజీ ఉపకులపతి కంకణాల రత్నయ్య పిలుపునిచ్చారు. విద్యార్థులు కష్టంతో కాకుండా ఇష్టంతో చదవాలని ఉత్తమ స్థానాలకు చేరిన వ్యక్తులను ఆదర్శంగా తీసుకుని ముందుకెళ్లాలని అమ్యాక్స్ సీఈవో దశరథరెడ్డి సూచించారు. విద్యార్థులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని వీకోట అర్బన్ పోలీస్ స్టేషన్ సిఐ లింగప్ప సూచించారు. గత దశాబ్ద కాలంగా వీకోట మండలంలో విద్యార్థులకు ఎంతో సహకారం నుంచి వారు ఉన్నత స్థానాలకు వెళ్లేందుకు కృషిచేసిన పాఠశాల కరస్పాండెంట్ రఘుపతితో పాటు ఇతర సిబ్బందికి ముఖ్యఅతిథులు అభినందనలు తెలియజేశారు. అతిథులను పాఠశాల యాజమాన్యం ఘనంగా సన్మానించి జ్ఞాపకలను అందజేశారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఎంఈఓ చంద్రశేఖర్, ప్రముఖ కవి నారాయణస్వామి, ఎస్ఐ మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

దొంగ ఓట్లు, నోట్లుతో గెలుపు సాధ్యం కాదు: మాజీ మంత్రి

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజి మంత్రి

ప్రజాశక్తి-చిత్తూరుఅర్బన్: దొంగ ఓట్లు అక్రమ సంపాదనతో ఎన్నికల్లో విజయం అధికార పార్టీకి సాధ్యం కాదని మాజీ మంత్రి అమరనాథరెడ్డి అన్నారు. స్థానిక టిడిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైసీపీ పాలనలో ఎర్రచందనం, ఇసుక రవాణా, మైనింగ్ మాఫియా చెలరేగిపోయి అక్రమ సంపాదనతో ఓటర్లను కొనుగోలు చేసేందుకు సిద్ధం చేస్తోందన్నారు. చంద్రగిరిలో చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి గంజాయి మాఫియాను ప్రోత్సహిస్తున్నట్లు చెప్పారు. అధికార్ల అండతో పెద్ద సంఖ్యలో దొంగ ఓట్లను చేర్పించారని దొంగ ఓట్ల నమోదుకు సహకరించిన అధికారులపై ఈసీ చర్యలు తీసుకోవాలన్నారు. అంబేద్కర్ 125 అడుగుల విగ్రహాన్ని ఏర్పాటు చేసే అర్హత జగన్మోహన్‌రెడ్డికి లేదన్నారు. తిరుపతి పార్లమెంట్‌లో 30 వేల దొంగ ఓట్లతో విజయం సాధించిన ఎంపి గురుమూర్తి ఎన్నిక చెల్లదన్నారు. అసెంబ్లీ ఎన్నికలను సమర్థవంతంగా ఎదుర్కొంటామన్నారు. స్థానిక సంస్థలో అక్రమంగా విజయం సాధించడాన్ని న్యాయపరంగా ఎదుర్కొంటామని హెచ్చరించారు. ఈ విలేకరుల సమావేశంలో మాజి ఎంఎల్సి దొరబాబు, నగర అధ్యక్షులు కఠారి హేమలత, పూతలపట్టు ఇన్‌చార్జి మురళీకృష్ణ పాల్గొన్నారు.

నారాయణ స్వామికి టికెట్ ఇవ్వకుంటే మూకుమ్మడి రాజీనామాలు

- పెనుమూరు వైసీపీ నేతలు

ప్రజాశక్తి చిత్తూరుఅర్బన్: జీడి నెల్లూరు అసెంబ్లి టికెట్ నారాయణస్వామికి ఇవ్వకుంటే మూకుమ్మడి రాజీనామాలు చేస్తామని అధికార వైసీపీ పెనుమూరు ప్రజాప్రతినిధులు తెలిపారు. శనివారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నాయకులు యశోదారెడ్డి, మార్కెట్ కమిటి చైర్మెన్ కమలాకర్‌రెడ్డి, విజయకుమార్, అమీన్, ముక్తర్, రాజారెడ్డిలు మాట్లాడుతూ జీడి నెల్లూరు నియోజవర్గంలో ఇంటింటికి తిరిగి ప్రజా సమస్యలు తెలుసుకున్న నాయకుడు, రెడ్ల అధిపత్యం నుండి నియోజవర్గ ప్రజలను కాపాడిన వ్యక్తి నారాయణస్వామిని కాదని స్థానికేతరుడు రెడ్డిప్పకు టికెట్ ఇవ్వడాన్ని తాము వ్యతిరేకిస్తున్నట్లు తెలిపారు. మహాసముద్రం కుటుంబం పార్టీ అధిష్టానానికి నారాయణస్వామిపై తప్పుడు సమాచారం ఇవ్వడం వల్ల ఈ పరిస్థితి ఏర్పాడిందని రెడ్డప్పకు ఎంపి, నారాయణస్వామికి ఎంఎల్ఏ టికెట్ ఇస్తే భారి మెజార్టీతో గెలిపిస్తామన్నారు. ఈ విలేకరుల సమావేశంలో పెనుమూరు మండల వైకాపా ప్రజా ప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో మెరుగైన సౌకర్యాలు

- నగర కమిషనర్ డాక్టర్ అరుణ

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: సార్వత్రిక ఎన్నికలు దృష్ట్యా నగరపాలక పరిధిలోని పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికల సంఘం నిర్దేశించిన మేర సౌకర్యాలు కల్పించే పనులు వేగంగా పూర్తి చేయాలని ఏఈఆర్వో, నగర కమిషనర్ డాక్టర్ అరుణ ఇంజనీరింగ్ విభాగం అధికారులను ఆదేశించారు. శనివారం కమిషనర్ కొంగారెడ్డిపల్లి పరిధిలోని 25, 26, 45, 47, 50, 52 పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. పోలీస్ కేంద్రాల్లో జరుగుతున్న ఎలక్ట్రికల్, నీటి సరఫరా, ర్యాంపుల నిర్మాణ పనులను తనిఖీ చేశారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో విద్యుదీకరణ, ఫర్నిచర్, నీటి సరఫరా, మరుగుదొడ్లు, ర్యాంప్ సౌకర్యాలు కచ్చితంగా ఉండాలన్నారు. షర్మన్ బాలికల ఉన్నత పాఠశాల, ప్రభుత్వ ఐటిఐ లోని పోలింగ్ కేంద్రాల్లో జరుగుతున్న ఎలక్ట్రికల్ పనులను కమిషనర్ తనిఖీ చేశారు. పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాల కల్పనపై ఇంజనీరింగ్ అధికారులకు పలు సూచనలు చేశారు. పనులను వేగంగా పూర్తి చేయాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఎంఈ గోమతి, డీఈ రమణ, ఏఈ రజని, వార్డు అమినిటీ కార్యదర్శులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాలను పరిశీలిస్తున్న కమిషనర్

కార్వేటినగరం: అసెంబ్లీ ఎన్నికలు పార్లమెంటు ఎన్నికలు నిర్వహించనున్నందున పోలింగ్ కేంద్రాలలో ముందస్తు ఏర్పాట్లలో భాగంగా విద్యుత్తు, త్రాగునీరు, మరుగుదొడ్లు రయాంపుల సౌకర్యం కల్పించవలసినదిగా అందరూ సెక్టోరల్ అధికారులకు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లకు, పంచాయత్ రాజ్ కార్వేటినగరం సమీక్ష సమావేశం ఏర్పాటు చేసి తహశీల్దార్ రవికుమార్, ఎంపీడీవో మోహన్ మురళి ఈనెల 26వ తేదీలోగా ఏర్పాటు చేయాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. మండల విద్యాశాఖ అధికారి విజయకుమార్ మనోజకుమార్, హౌసింగ్ ఏఈ యోగమూర్తి నాయుడు, పంచాయతీ రాజ్ దినేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు పోటీతత్వాన్ని పెంపొందించుకోవాలి

- డీఈవో విజయేంద్రరావు

ప్రజాశక్తి-బంగారుపాళ్యం: పోటీ తత్వానికి నవోదయ ప్రవేశ పరీక్షల్ని నిర్వహిస్తున్నట్లు డీఈవో విజేందర్‌రావు అన్నారు. శనివారం బంగారుపాళ్యం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నవోదయ విద్యాలయ సమితిలో 6వ తరగతిలో 2024 - 25 విద్యా సంవత్సరం ప్రవేశం కొరకు ప్రవేశ పరీక్ష నిర్వచించడం జరిగింది. ఉత్తమ ఫలితాలు సాధించిన వారికి కేంద్ర ప్రభుత్వం విద్యలో ప్రత్యేక విద్యావంతులు చేయాలని లక్ష్యమే ప్రభుత్వ ధ్యేయమని డీఈవో అన్నారు. ఈ పరీక్షకు బంగారుపాళ్యం ప్రభుత్వ ఉన్నత పాఠశాల సెంటరు నందు 245 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా పరీక్షకు 202 మంది విద్యార్థులు హాజరు కాగా 43 మంది గైర్హాజరు అయ్యారు. కార్యక్రమంలో ఎంఈవో నాగేశ్వరరావు, నవోదయ పాఠశాల ప్రిన్సిపల్ పరీక్ష చీఫ్ సూపరిండెంట్‌గా మొగిలి మిట్టూరు హైస్కూల్ ప్రధాన ఉపాధ్యాయుడు చంగల్ రెడ్డి, డిపార్ట్మెంట్ ఆఫీసర్‌గా సలీం బాషా తదితరులు పాల్గొన్నారు.

పరీక్షను పర్యవేక్షిస్తున్న డీఈవో

దొంగ ఓట్ల చేర్పు.. బడుగుల సీట్ల మార్పు..

ప్రజాశక్తి-చిత్తూరుఅర్బన్: ఈసి నిబంధనలకు విర్ధుంగా అధికార పార్టీ భారీ సంఖ్యలో దొంగ ఓట్లు నమోదు చేసి ఎన్నికల్లో గెలవాలని ప్రయత్నిస్తోందంటూ ప్రతిపక్ష పార్టీ అరోపిస్తోంది. జిల్లా వ్యాప్తంగా దొంగఓట్ల నమోదు చిచ్చు రేపుతోంది. ఈనెల 22వ తేది ఓటర్ల తుది జాబితా విడుదల కానుంది. ఓటర్ల తుది జాబితా విడుదల తరువాత అందులో దొంగ ఓట్లు ఎన్ని ఉన్నాయన్న విషయాన్ని తేల్చేందుకు ప్రతిపక్ష తెలుగుదేశం బూతుల వారిగా వెరిఫికేషన్ ప్రారంభించనుంది. ఇలా ఉంచితే కొత్త ఓటర్లు జిల్లాలోని ఏడు నియోజకవర్గాలో లక్షా 20 వేల వరకు పెరిగారు. ఇందులో చిత్తూరు నియోజకవర్గంలో 30వేలకు పైగా కొత్త ఓటర్లు నమోదు చేసుకోవడం జరిగింది. కొత్త ఓట్ల నమోదులో ఈసీ నిబంధనలు పాటించడం లేదని అరోపనులున్నాయి. కొత్త ఓటర్ల చేర్పులో 40, 50 సంవత్సరాలున్నాయని అనేక మందికి జీరో ఇంటి నెంబర్‌తో ఓటు ఎలా ఇస్తారని ప్రశ్నస్తున్నాయి.

అధికార పార్టీ అధికారులు, వాలంటీర్ల ద్వారా పెద్ద సంఖ్యలో దొంగ ఓట్లు నమోదుకు పూనుకుందని ఎన్నికల్లో ఎలాగైనా గెలవాలనే లక్ష్యంతో రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును అపహాస్యం చేస్తోంది. మరో వైపు అక్రమ మార్గాల్లో కోట్లు గడించిన వారికి సీట్లు కేటాయిన్నారనే విమర్శలున్నాయి. జిల్లాలోని ఎస్సీ నియోజకవర్గాల్లో మాత్రమే సిటింగ్ ఎంఎల్ఏలను కాదని కొత్త వారికి సీట్లు కేటాయిస్తారంటున్నారు. అగ్రవర్ణాలకు చెందిన ఎంఎల్ఏ స్థానాల మార్పు ఎందుకు చేయడం లేదనేది ప్రశ్నగానే మిగిలిపోతోంది. దొంగ ఓట్ల రగడ ఈసీ ఓటర్ల నమోదు కార్యక్రమం ప్రారంభం నుంచి ఉంది ప్రతిపక్ష పార్టీ ఎప్పటికప్పుడు ఈసి, అధికారులకు దృష్టికి దొంగ ఓట్ల విషయాన్ని తీసుకొస్తోంది. నిజాయితీ, నిష్పక్ష పాతంగా నిర్వహించాల్సిన ఎన్నికలు దొంగ ఓట్లు ప్రభావితం చేస్తాయనడంతో సందేహం లేదు. నియోజకవర్గంలో వెయ్యి దొంగ ఓట్లు ఉంటే చాలు ఫలితాలను తారుమారు చేసేందుకు. ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు అర్హత ఉన్న ప్రతి ఒక్కరు ఓటరుగా నమోదు చేసుకోవాలి. ఓటు హక్కు కలిగిన ప్రతి ఒక్కరూ స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోవాలి. ఇలాంటి వాతావరణం కల్పించాల్సిన బాధ్యత అధికార్లపై ఉంది.

ప్రజా'దృష్టి'

ఈనెల 22వ తేది జిల్లా ఓటర్ల తుది జాబితా విడుదల కానుంది.. ఓటర్ల తుది జాబితా విడుదల ముందే అధికార, ప్రతిపక్ష పార్టీలు ఓటర్లను ప్రసన్నం చేసుకొనేందుకు నానాతంటాలు పడుతున్నారు. గ్రిప్టులు, క్రీడా పోటీల పేరుతో యువతను ఆకట్టుకుంటున్నారు. ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చాక భారీ స్థాయిలో గ్రిప్టులు ఇవ్వడం కుదరపోవడంతో సంక్రాంతి, నూతన సంవత్సరం పేరుతో కానుకలు అందజేస్తున్నారు. ప్రతి నియోజకవర్గంలో ఇదే పరిస్థితి అధికార, ప్రతిపక్ష పార్టీలు పోటా పోటీగా ఓటర్లను ప్రసన్నం చేసుకొనేందుకు గడపగడప పేరుతో పాదయాత్రలు చేస్తున్నారు. విజ్ఞత కలిగిన ఓటరు ఏ వైపు మగ్గుచూపుతాడో.. ఎవరికి విజయం చేకూరుస్తారో ఎన్నికల ఫలితాలు వచ్చేంత వరకు వేచిచూడాలి.

'జయహో బీసీ'ని జయప్రదం చేయండి

ప్రజాశక్తి-గుడిపల్లి: వైసీపీ అధికారంలోకి వచ్చింది మొదలు బీసీలకు జరుగుతున్న అన్యాయాలపై సమరశంఖం పూరించడానికి 'జయహో బీసీ' కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు కుప్పం మాజీ మార్కెట్ కమిటీ ఛైర్మన్, కుప్పం నియోజకవర్గ కన్వీనర్ చంద్రశేఖర్ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ బీసీ సబ్‌ప్లాన్ నిధులు రద్దు, బ్యాంకుల ద్వారా బీసీ కులాలకు రుణాలు, కుల వృత్తులకు ఆదరణ పథకాలు, బీసీ కులాలకు కళ్యాణమస్తు వంటి పథకాలను వైసీపీ ప్రభుత్వం రద్దు చేసిందన్నారు. ప్రభుత్వ వ్యతిరేక విధానాలు, బీసీలకు జరుగుతున్న అన్యాయాలపై ఈ నెల 21 నుంచి 28వరకు కుప్పంలో 'జయహో బీసీ' కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు చెప్పారు. బీసీలంతా ఐక్యమై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

పెరటి కోళ్లు పంపిణీ

ప్రజాశక్తి-వెదురుకుప్పం: వెలుగు కార్యాలయం వద్ద శనివారం ఏపీఎం కవిత ఆధ్వర్యంలో పెరటి కోళ్లను పంపిణీ చేశారు. మండలానికి 40 యూనిట్లు అందజేయగా వాటిని లబ్ధిదారులకు పంపిణీ చేసినట్లు ఆమె తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో ప్రేమ్ కుమార్, జడ్పీటీసీ సుకుమార్, సర్పంచ్ శిల్పా, వెంకటేష్ పాల్గొన్నారు.

జిపిడిపీపై ఎంపీడీవో సమీక్ష

ప్రజాశక్తి-సోమల: రానున్న ఆర్థిక సంవత్సరం గ్రామాలలో ఏర్పాటు చేయాల్సిన మౌలిక వసతులపై ఎంపీడీవో నాగరాజు కార్యదర్శులతో సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పంచాయతీలలో మౌలిక సదుపాయాలు, పారిశుద్ధ్యం, త్రాగునీరు, రోడ్లు, ఇతర సౌకర్యాలపై ముందస్తు ప్రణాళిక సిద్ధం చేసేందుకు జిపిడిపి క్రింద వివరాలను నమోదు చేసి ఇందుకోసం అవసరమైన బడ్జెట్ను అంచనా వేసి ఆన్లైన్ చేయాల్సి ఉంటుందన్నారు. ఈనెల 30వ తేదీ లోపు కార్యదర్శులు అందరూ నివేదికలను సిద్ధం చేయాలన్నారు. కార్యక్రమంలో ఈఓఆర్డి లక్ష్మీదేవి, కార్యదర్శులు పాల్గొన్నారు.

మామిడి సాగులో

యాజమాన్య పద్ధతులు పాటించాలి

ప్రజాశక్తి-రామకుప్పం: రైతులు మామిడి సాగులో యాజమాన్య పద్ధతిలో అధిక దిగుబడి సాధించవచ్చు అని జిల్లా హార్టికల్చర్ అధికారి మధుసూదన్ రెడ్డి పేర్కొన్నారు. శనివారం ఎంపీడీవో కార్యాలయంలోని సమావేశ భవనంలో మామిడి రైతులతో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మామిడి తోటలో పురుగులు నివారణకు కోత అనంతరం మామిడి కొమ్మలను కత్తిరింపు చేసి గాలి వెలుతురు ప్రసరించేలా చూడాలన్నారు. పూత మొదలు కావడానికి ముందు మల్టీకే ఎరువులు వదిలి, బోరాన్ నీటితో కలుపుకొని పిచికారి చేయాలన్నారు. పురుగుల మందు ఒకే రకం వాడకుండా మార్పులు చేసుకోవాలన్నారు. చెట్టు కాండం నుంచి చిగురు వరకు తడిసేలా మందును పిచికారి చేయాలన్నారు. కార్యక్రమంలో ఉద్యాన, వ్యవసాయ శాఖ అధికారులు డింపు ప్రియ, అమృత, ఆనంద్, మధురవాణి, రైతు భరోసా సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.ఔ

మేటి మందలో '104' సేవలు

ప్రజాశక్తి-సోమల: మండలం ఇరికిపెంట పంచాయతీ మేటి మంద గ్రామంలో శనివారం సోమల ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో 104 వాహనం ద్వారా గ్రామస్తులకు వైద్య సేవలను అందజేశారు. గ్రామంలోని సుమారు 40 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు మాత్రలను పంపిణీ చేశారు. బిపి, షుగర్, జ్వరం, జలుబు, బాడీపెయిన్స్ ఇతర దీర్ఘకాలిక వ్యాధులు ఉన్నవారికి పలు రకాల వైద్య పరీక్షలు నిర్వహించి సూచనలను అందజేశారు. కార్యక్రమంలో ప్రదీప్‌కుమార్ రెడ్డి, సిహెచ్ఓ అమర్నాథ్, ఏఎన్ఎం మదనిక, ఆశా కార్యకర్తలు గుణవతి, నాగరత్న గ్రామస్తులు పాల్గొన్నారు.

పండుగకు ఓకే.. జల్లికట్టుకు నో

ప్రజాశక్తి-సోమల: జిల్లాలోనే అత్యంత వైభవంగా నిర్వహించే పెద్ద ఉప్పరపల్లె పశువుల పండుగ(జల్లికట్టు) ఆదివారం 21వ తేదీ నిర్వహించాల్సి ఉండగా శనివారం ఉదయం నుండి పోలీసులు గ్రామ పెద్దలు పలు విడతలు చర్చలు జరిపి ఆదివారం నిర్వహించే జల్లికట్టుకు అనుమతి లేదని పండుగ మాత్రం జరుపుకోవచ్చునని పోలీసులు తేల్చి చెప్పారు. ప్రతి ఏడాది సంక్రాంతి పండుగ సందర్భంగా పెద్ద ఉప్పరపల్లెలో పసల మంద వద్ద అత్యంత వైభవంగా పశువుల పందేలను నిర్వహిస్తూ రావడం ఆనవాయితీగా వస్తోంది. ఈ క్రమంలో 21వ తేదీ ఆదివారం పండుగ నిర్వహించేందుకు గ్రామస్తులు అన్ని ఏర్పాట్లు చేసేందుకు సిద్ధమవుతుండగా శనివారం ఉదయం నుండి సీఐ, ఎస్సై, పోలీసులు గ్రామానికి చేరుకొని జల్లికట్టు నిర్వహించడానికి వీలు లేదని అనుమతులు లేవని చెప్పడంతో దీనిపై గ్రామంలో ఎక్కడ చూసినా పండుగ జరుగుతుందో లేదో నన్న సందిగ్ధం నెలకొంది. దీనిపై ప్రజాశక్తి ఎస్సై వెంకట నరసింహులు వివరణ కోరగా జల్లికట్టు నిర్వహించేందుకు అనుమతులు లేవని పండుగ మాత్రం జరుపుకోవచ్చునని అదే విషయాన్ని పెద్దలకు చెప్పడం జరిగిందని తెలిపారు.

పోలీసులు అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి -తిరుపతి సిటీ: ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో పోలీసులు అప్రమత్తంగా ఉండాలని రాయలసీమ రేంజ్ డీఐజీ ఆర్ఎస్ అమ్మిరెడ్డి పిలుపు నిచ్చారు. స్థానిక శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం సావేరి అతిథి గృహం సమావేశ మందిరంలో జిల్లా పోలీస్ అధికారులతో డీఐజీ నెలవారి నేర సమీక్ష సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం నడుస్తున్న ఈ మూడు నెలలు అత్యంత క్లిష్టమైన రోజులు అని, మనం అప్రమత్తంగా ఉండకపోతే అందరూ సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుందని తెలిపారు. సమస్యలు ఎక్కడ ఉత్పన్నం అవుతున్నాయో తెలుసుకొని సకాలంలో పరిష్కరించు కోవాలన్నారు. ఈ రోజు నుండే తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. క్రిటికల్ పోలింగ్ స్టేషన్లు ఉన్న గ్రామాలు, వార్డులను ప్రతిరోజూ సందర్శించి, స్థానికులతో సమావేశమై ముందస్తు సమాచారాన్ని సేకరించి ఎన్నికల నియమావళిని వివరించి అక్కడ నివసిస్తున్న ఎలక్షన్ ట్రబుల్ మాంగర్స్ కదలికలను అరికట్టాలన్నారు. ఎస్‌హెచ్ఓలు అందరూ తమ పరిధిలోని ప్రతి పోలింగ్ స్టేషన్ల భౌగోళిక స్థితిగతులను తెలుసుకొని శాంతియుతంగా ఎన్నికలు నిర్వహించేందుకు ప్రణాళికా బద్ధంగా పని చేయా లన్నారు. అమాయక ప్రజలను అనవసరంగా ఎన్నికల కేసులలో ఇరికించవద్దని, పాత ఎన్నికల ట్రబుల్ మాంగర్స్‌ను బైండోవర్ చేసి తరచుగా కౌన్సెలింగ్ నిర్వహిస్తూ ఉక్కు పాదం మోపి వారిని నిలువ రించాలన్నారు. ఎస్‌పి పి.పరమేశ్వర రెడ్డి మాట్లాడుతూ రాబోయే ఎన్నికల విధుల్లో ఏ అధికారి, పోలీసు సిబ్బంది పక్షపాతంతో వ్యవహరించకూడదన్నారు. పోలింగ్ స్టేషన్ లో అక్రమాలు జరిగినప్పుడులేదా జరుగుతున్నట్టు తెలిస్తే మౌనం వహించ కూడదని, ఎన్నికల నిబంధనలు, విధులను ఉల్లంఘించిన అధికారులు, సిబ్బందిపై భారత ఎన్నికల సంఘం తీవ్రమైన చర్యలు తీసుకుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీలు వెంకటరావు, కులశేఖర్, విమల కుమారి, రాజేంద్ర, ట్రైనీ ఐపీఎస్ పాటిల్ దేవరాజ్ మనీష్, జిల్లాలోని డీఎస్పీలు, సిఐలు, ఎస్సైలు, ప్రశంసా పత్రాలు అందుకున్న సిబ్బంది పాల్గొన్నారు.

'సిరా రంగులు' పుస్తకావిష్కరణ

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): ఐఎఎస్ అధికారి అభిషేక్ సింహ్ రాసిన హిందీ కవితలను తెలుగులోకి ఆకుల మల్లేశ్వరరావు అనువాదం చేసి రూపొందించిన 'సిరా రంగులు' పుస్తకావిష్కరణ తిరుపతి నగర పరిధిలోని ఛాంబర్ ఆఫ్ కామర్స్ కార్యాలయంలో శనివారం ఘనంగా నిర్వహించారు. డాక్టర్ నాదెండ్ల శ్రీమన్నా రాయణ అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో తెలుగు భాషా ఉద్యమ సమితి అధ్యక్షురాలు గంగవరం శ్రీదేవి పుస్తకావిష్కరణ చేశారు. ఈ సందర్భంగా శ్రీదేవి మాట్లాడుతూ అనువాద సాహిత్యం విరివిగా రాయడం వల్ల తెలుగు సాహిత్యం మరింత సుసంపన్నం అవుతుందని అన్నారు. అనువాద ప్రక్రియ అనేది కత్తి మీద సాములాంటిదని, మూల రచనల్లోని అంశాలు, భావాలు, తెలుగుదనం ప్రతిబింబించే జాతీయమైన తెలుగు భాషలో చెప్పడం అనువాద రచన స్వతంత్ర రచన అనంత సృజనాత్మకంగా ఉండాలని గాలి గుణశేఖర్ తెలిపారు. నాదెండ్ల శ్రీమన్నారాయణ మాట్లాడుతూ స్యాహీకే రంగ్ హిందీ కవితలను ఆకుల మల్లేశ్వర రావు సరళ సుందరమైన తెలుగులో ' సిరా రంగ్ ' పేరిట పుస్తకం తీసుకురావడం అభినందనీయమన్నారు. అను వాద కర్త ఆకుల మల్లేశ్వరరావు మాట్లాడుతూ తను అనువాదంలోని విషయాలను తెలిపారు. ఈ కార్యక్రమం లో టెంకాయల దామోదరం, తెలుగు భాషా ఉద్యమ సమితి వ్యవస్థాపకులు డాక్టర్ సాకం నాగరాజ, తమటం రామచంద్రారెడ్డి, పేరూరు బాలసుబ్రమణ్యం, కృష్ణవేణి, సుభద్ర, అరసం అధ్యక్ష కార్యదర్శులు యువశ్రీ మురళి, నెమిలేటి కిట్టన్న, సురేంద్ర రోడ్డా, గొడుగుచింత గోవిందయ్య, నడ్డి నారాయణ, మల్లారపు నాగార్జున, ఏను గు అంకమ నాయుడు, లక్ష్మయ్య పాల్గొన్నారు.

అవయవ దానంపై చైతన్యం అవసరం

అవగాహన సదస్సులో పలువురు వక్తల పిలుపు

ప్రజాశక్తి- తిరుపతి సిటీ: అవయవ దానం పై ప్రతి ఒక్కరిలో చైతన్యం అవసరం అని పలువురు వక్తలు ఉద్ఘాటించారు. స్థానిక తుడా రోడ్డు లోని సంకల్ప సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో అవయవ దానంపై అవగాహన సదస్సును శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన స్విమ్స్ డైరెక్టర్ డాక్టర్ ఆర్ వి కుమార్ మాట్లాడుతూ రెండు రోజుల క్రితం స్విమ్స్ ఆసుపత్రిలో బ్రెయిన్ డెడ్ కు గురైన హేమ కుమార్ యువకుడి అవయవాలు దానం చేయడం ద్వారా నలుగురు ప్రాణాలను కాపాడగలిగామన్నారు. చెన్నై బెంగళూరు హైదరాబాద్ వంటి మహానగరాలకే పరిమితమైన అవయవ దానం మార్పిడి శస్త్ర చికిత్సలను నేడు తిరుపతి లోని స్విమ్స్ ఆసుపత్రుల్లోనే విజయవంతంగా నిర్వహించడం అభినందనీయమన్నారు. గతంలో కోటీశ్వరులకు మాత్రమే అవకాశమున్న అవయవ మార్పిడిని, రాష్ట్ర ప్రభుత్వం చొరవతో ఆరోగ్యశ్రీ ద్వారా సామాన్యులకు సైతం ఉచితంగా అందించగలుగుతున్నామన్నారు. అవయవదానంపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని సూచించారు. మోహన్ ఫౌండేషన్ నిర్వాహకులు డాక్టర్ భాను మాట్లాడుతూ అవయవ దానంపై ప్రతి ఒక్కరూ ఆహ్వాన కల్పించేందుకు తమ సంస్థ నిరంతరం కృషి చేస్తుందన్నారు. అవయవ దానం పై అపోహలు వీడి అవయవ దాతతో పాటు కుటుంబ సభ్యులూ అవగాహన పెంచుకోవాలన్నారు. శ్వేతా మాజీ సంచాలకులు భూమన్ మాట్లాడుతూ కుల మతాలు అవయవదానానికి అడ్డంకి కాదన్నారు. అవయవదానం ద్వారా తాము మరణించిన నలుగురిని బతికించేందుకు సహాయపడుతామని గుర్తు చేశారు. సాంకేతి కంగా అభివృద్ధి చెందుతున్న నేటి సమాజంలో కూడా అపోహలకు చోటివ్వడం సరికాదన్నారు. ఈ కార్యక్రమంలో సంకల్ప ఆసుపత్రి చైర్మన్ డాక్టర్ బండ్ల నాగేశ్వర్, మేనేజింగ్ డైరెక్టర్ నాగరాజు కుమార్, డాక్టర్ దగ్గు మాటి శ్రీహరిరావు, డాక్టర్ ఆనంత్, సంకల్ప ఆస్పత్రి డైరెక్టర్ ప్రేమ్, వైద్యులు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్ఓవాటర్ ప్లాంటు ప్రారంభం

ప్రజాశక్తి -వెంకటగిరి రూరల్ : తిరుపతి జిల్లా వెంకటగిరి మండలంలోని చిన్నప్పరెడ్డి పల్లి పంచాయతీ నీల కంటాపురం గ్రామానికి సురక్షితమైన, స్వచ్ఛమైన తాగునీటిని అందించడానికి, శ్రీనివాసన్ సర్వీసెస్ ట్రస్ట్ ద్వారా రూ.6.26 లక్షలతో గ్రామంలో గంటకు 500 లీటర్ల బోర్‌వెల్‌తో కూడిన ఆర్‌వో వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేశారు. ఇక్కడ నీరు నాణ్యత లోపించి తాగలేని పరిస్థితి వుంది. డాక్టరు పళని స్వామి సమక్షంలో, (రిటైర్డ్) - విద్యా సలహాదారు, వెంకటగిరి రాజా విబి సాయికృష్ణ యాచేంద్ర పాల్గొని వాటర్ ప్లాంట్‌ను ప్రారంభించి ప్రజలకు నీటి సరఫరాకు శ్రీకారం చుట్టారు. జిల్లా గిరిజన సంక్షేమ అధికారి సూర్య నారాయణ, యానాదుల కమ్యూనిటీ కోసం అందుబాటులో ఉన్న ప్రభుత్వ సంక్షేమ పథకాల గురించి వివరించారు. గ్రామ ముఖ్య వ్యక్తుల సైట్ హెడ్ జైసింగ్ వెంకటగిరితో కలిసి యాక్సెస్, సౌకర్యాలను మెరుగుపరచడానికి శ్మశాన వాటిక స్థలాన్ని పరిశీలించారు. డా.భాస్కర్ రావు పరిశుభ్రమైన సురక్షితమైన నీటి ప్రాముఖ్యత, కలుషిత నీరు తాగడం వల్ల కలిగే దుష్ప్రభావాలను వివరించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న తిరుపతి ఉద్యానవనశాఖ సహాయ సంచాలకులు దశరథరామిరెడ్డి, ఎస్టీ రైతులకు అందుతున్న పథకాల గురించి వివరించి ఉపయోగించు కోవాలన్నారు. ఏపీ గిరిజన సంక్షేమ రెసిడెన్షియల్ పాఠశాల (బాలికలు), వెంకటగిరి - ప్రిన్సిపాల్ విజయ బాస్కర్ రెడ్డి శ్రీనివాసన్ సర్వీసెస్ ట్రస్ట్ గ్రామాభివృద్ధి అధికారులు, అలేఖ్య, కేశవులు, అప్పిని పార్ధ, హరికృష్ణ, గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులతో ఈ కార్యక్రమం నిర్వహించారు.

చెడు అలవాట్లు లేకుంటేనే చక్కని ఆరోగ్యం

ప్రజాశక్తి -దొరవారిసత్రం: మద్యం సేవించడం, పొగ తాగడం, పొగాకు ఉత్పత్తులు వాడడం వంటి అలవాట్లను మానుకుంటేనే ఆరోగ్యం మెరుగవుతుందని వైద్యాధికారి చైతన్య రోగులకు సూచించారు. శనివారం దొరవారిసత్రం పిహెచ్‌సి పరిధిలోని వేణుంబాకం గ్రామంలో నిర్వహించిన విలేజ్ డాక్టర్స్ క్లినిక్‌లో పలువురి రోగులను పరీక్షించి అవసరమైన మందులు అందించారు. ప్రధానంగా రోగాలకు కారణమవుతున్న చెడు వ్యసనాలను మాని, మంచి ఆహారం సేవించి ఆరోగ్యం కాపాడుకోవాలని సూచించారు. బీపీ, షుగరు వ్యాధి గ్రస్తులకు రోగ స్థాయిని బట్టి మందులు అందించారు. ప్రతి నెలలో గ్రామాలకు వస్తున్న104 వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కంటి వెలుగులో పరీక్షలు చేయించుకున్న కంటి చూపు లోపం ఉన్న పలువురికి కంటి అద్దాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్ హెచ్ పి పావని, హెల్త్ అసిస్టెంట్ సుధాకర్, డీఈవో శివ, ఆశా కార్యకర్తలు సుజాత, సుగుణ పాల్గొన్నారు.

తొట్టంబేడు ఎస్ఐ సేవలకు ప్రశంస

ప్రజాశక్తి- తొట్టంబేడు: తొట్టంబేడు ఎస్ఐ రాఘవేంద్ర కు శనివారం తిరుపతిలోని పద్మావతి యూనివర్సిటీలో నిర్వహించిన పోలీసుల సమీక్ష సమావేశంలో అనంతపురం రేంజి డిఐజి ఏ ఎన్అమ్మిరెడ్డి ప్రశంసా పత్రం అందించి అభినందించారు . గత ఏడాది నవంబర్ 29న కురిసిన భారీ వర్షాలకు మండలంలోని కారాకొల్లు వద్ద గుండ్లమడుగు వాగు దాటేందుకు ప్రయత్నిస్తుండగా వరద ఉధృతి ఎక్కువగా కావడంతో వాగు దాటేందుకు ప్రయత్నిస్తున్న కారాకొల్లు గ్రామానికి చెందిన చిన్న బత్తయ్య నాయుడు(52) ఆయన సతీమణి నాగరత్నమ్మ (42)లు తిరువన్నామలై కు వెళ్లి వస్తుండగా వరద ప్రవాహంలో చిక్కుకుపోయిన విషయం తెలిసిందే. అయితే వీరు పక్కనే ఉన్న ఓ విద్యుత్ స్తంభాన్ని పట్టుకొని సాయం కోసం కేకలు వేయడంతో గమనించిన స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారాన్ని అందించారు . దీంతో వెంటనే స్పందించిన ఆయన అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. దీంతో హుటాహుటిన తొట్టంబేడు ఎస్ఐ రాఘవేంద్ర అక్కడికి చేరుకుని వరద ప్రవాహంలో చిక్కుకొని విద్యుత్ స్తంభాన్ని పట్టుకొని సాయం కోసం ఎదురుచూస్తున్న భార్యాభర్తలను తొట్టంబేడు ఎస్ ఐ , సిబ్బంది వరద ఉధృతిని కూడా లెక్క చేయకుండా అక్కడికి చేరుకుని వారిని సురక్షితంగా బయటికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా పలువురు గ్రామస్తులు పోలీసులను అభినందిం చారు. ఈ నేపథ్యంలో శనివారం పద్మావతి యూనివర్సిటీలో జరిగిన పోలీసుల సమీక్ష సమావేశంలో తమ సాహసాన్ని ప్రదర్శించి ఇద్దరి ప్రాణాలను కాపాడిన ఎస్ఐ రాఘవేంద్రను అనంతపురం రేంజి డిఐజి అమ్మిరెడ్డి అభినందించడంతో పాటు ప్రశంసా పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా పలువురు ఎస్ఐను అభినందించారు.

వారసత్వ పార్టీలను తరిమికొట్టండి: ఆమ్ ఆద్మీ

ప్రజాశక్తి -రామచంద్రపురం (చంద్రగిరి): దేశంలో వారసత్వ రాజకీయాలతో అవినీతి పాలన సాగిస్తున్న వారసత్వ పార్టీలను తరిమికొట్టి క్రమశిక్షణ కలిగిన ఆమ్ ఆద్మీని ఆదరించి దేశ భవిష్యత్తుకు పునాది వేయాలని ఆమ్ ఆద్మీ పార్టీ ఏపీ రాష్ట్ర రాజకీయ వ్యవహారాల ఇన్‌ఛార్జి ఆర్ మణినాయుడు పిలుపు నిచ్చారు. ఆమ్ ఆద్మీ చిత్తూరు పార్లమెంటు జిల్లా అధ్యక్షులు, చంద్రగిరి నియోజకవర్గ కన్వీనర్ ఐరాల లోకేష్ ఆధ్వర్యంలో ఆ పార్టీ చంద్రగిరి నియోజకవర్గం కార్యకర్తల సమావేశం వైయస్ఎంఆర్ కళ్యాణ మండపంలో శనివారం వాడి వేడిగా జరిగింది. ఈ సందర్భంగా ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు సి రమేష్ కుమార్ మాట్లాడుతూ సామాన్యుడికి రాజ్యాధికారం అందని ద్రాక్ష లాగా ఉండే పరిస్థితుల్లో సామాన్యులకు అవకాశం కల్పి స్తున్న ఆమ్ ఆద్మీ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు అరవింద్ కేజ్రీవాల్ గొప్ప నాయకుడన్నారు. నేటి సమాజంలో కొన్ని రాజకీయ పార్టీలు కొన్ని కుటుంబాలు, కొన్ని ప్రాంతాల కోసమే పాలన సాగిస్తున్నాయని, కేజ్రీవాల్ అందరికీ అవకాశం ఇస్తూ అన్ని ప్రాంతాల సమానా భివృద్ధికి కృషి చేస్తారన్నారు. అవినీతిని అరికట్టటానికి ఆమ్ ఆద్మీ పార్టీలోకి అడిగిపెట్టిన కార్యకర్తలందరూ సైనికుల కష్టపడి పనిచేయాలని పిలుపునిచ్చారు . ఆంధ్రప్రదేశ్ ప్రజలు ఆమ్ ఆద్మీ పార్టీ వైపు ఆకర్షితులవుతున్నట్టు తెలిపారు. చీపురు గుర్తుతోనే అవినీతి పార్టీల నాయ కులను తరిమికొట్టాలని కోరారు. మొదట జెండాలు చేతబట్టి బ్యాండ్ సెట్, భజ భజంత్రీలతో వాయిద్యాలతో స్థానిక టవర్ క్లాక్ నుండి వైయస్ఎంఆర్ కళ్యాణ మండపం వరకు ర్యాలీ నిర్వహించారు. మొదట ఆప్ రాష్ట్ర రాజకీయ వ్యవహారాల ఇన్‌ఛార్జి మణినాయుడును దుశ్శాలువాతో సన్మానించారు. అనంతరం ప్రత్యేక ఆహ్వానితులందరినీ సన్మానించారు. తమ పార్టీకి ఐరాల లోకేష్ లాంటి యువ నాయకుడు దొరకటం అదృష్టమని రానున్న ఎన్నికలలో ఆమ్ ఆద్మీ పార్టీని ఆదరించి ఐరాల లోకేష్ ను గెలిపిం చాలని మణినాయుడు కోరారు. ఈ కార్యక్రమంలో తిరుపతి జిల్లా అధ్యక్షులు నగేష్, రాష్ట్ర ఉపాధ్యక్షులు వెంకటా చలపతి, ఆర్ కె పట్టెం, రాష్ట్ర కార్యదర్శి కల్లూరు బాల సుబ్రమణ్యం, నాయకులు తిరుమలరెడ్డి, నందిని, గుణశేఖర్ రెడ్డి, చిట్టిబాబు, శ్రీరాములు, చందు, అక్బర్ హుస్సేన్, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

చంద్రబాబుతోనే దళితులకు సామాజిక న్యాయం: నెలవల

ప్రజాశక్తి-నాయుడుపేట: చంద్రబాబుతోనే రాష్ట్రంలో దళితులకు సామాజిక న్యాయం జరుగుతుందని మాజీ ఎంపీ, సూళ్లూరుపేట నియోజకవర్గం టిడిపి ఇన్‌ఛార్జి నెలవల సుబ్రహ్మణ్యం అన్నారు. నాయుడుపేట పట్టణంలోని టిడిపి కార్యాలయంలో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వెంకటగిరిలో చంద్రబాబు నిర్వహించిన 'రా కదిలిరా..' కార్యక్రమాన్ని విజయవంతం చేసిన నియోజకవర్గ నాయకులకు, కార్యకర్తలకు ధన్యవాదాలు తెలిపారు. సీఎం జగన్ మోహన్ రెడ్డి దళితులపట్ల మొసలి కన్నీరు కారుస్తున్నారని విమర్శించారు. వైసీపీలోని దళిత ఎమ్మెల్యే, ఎంపీలను అవమానించారన్నారు. రానున్న ఎన్నికల్లో టిడిపి విజయం ఖాయమని దీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఏఎంసీ ఛైర్మన్ శిరసనం భేటీ విజయభాస్కర్ రెడ్డి, మాజీ జడ్పిటిసి పేరంశెట్టి శ్రీరాం ప్రసాద్, ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి పసల గంగా ప్రసాద్, యువజన విభాగం జిల్లా ఉపాధ్యక్షులు అవదానం సుధీర్, జిల్లా తెలుగు మహిళా ఉపాధ్యక్షురాలు చెందేటి సుజాత, టిడిపి నాయకులు గూడూరు సుధీర్ రెడ్డి, విజయ్ కుమార్ నాయుడు, సంచి కృష్ణయ్య, కాపులూరు చక్రపాణి, బల్లి ముత్యాలయ్య పాల్గొన్నారు.

కష్టపడే సమయం ఆసన్నమైంది: వెందోటి

ప్రజాశక్తి - బాలాయపల్లి : వైసిపి కార్యకర్తల నుంచి నాయకులు వరకు కష్టపడే సమయం ఆసన్న మయిందని వైసిపి మండల కన్వీ న ర్ వెందోటి కార్తీక్ రెడ్డి పేర్కొన్నారు. మండల కేంద్రంలో శనివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైసిపి ఇప్పటి వరకు అమలు చేసి సంక్షేమ పథకాలను ప్రతి కార్యకర్త గ్రామీణ ప్రాంతాల ప్రజలకు వివరించాలన్నారు.ఎన్నికల సమయం దగ్గర పడుతుంది ప్రతి కార్యకర్త ఒక సైనికుడు లాగా పని చేయాలని పిలుపునిచ్చారు. కష్టపడ్డ వారిని తాము గుర్తుపెట్టుకుంటామని తెలిపారు. ఇప్పటివరకు వైయస్ జగన్ మోహన్ రెడ్డి పార్టీలకు అతీతంగా ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందించామన్నారు. మండలంలోని ప్రతి పల్లెకు రోడ్డు బస్సు సౌకర్యం ఏర్పాటు చేసిన ఘనత నేదురుమల్లి కుటుంబందే అని గుర్తు చేశారు. మాజీ ముఖ్యమంత్రి జనార్దన్ రెడ్డి, వెంకటగిరి మాజీ ఎమ్మెల్యే రాజ్యలక్ష్మి తనయుడు నేదురుమల్లి రామ్ కుమార్ రెడ్డి ని వెంకటగిరి ఎమ్మెల్యేగా గెలిపించేందుకు ఎప్పటి నుంచి ఎన్నికలు పూర్తయ్యే వరకు అలుపెరగకుండా పనిచేయాలని కార్యకర్తలను నాయకులను కోరారు. ఈ కార్యక్రమంలో వైసిపి సీనియర్ నాయకులు గుర్రం రామ్మూర్తి యాదవ్, బాలాయపల్లి సహకార సంఘం అధ్యక్షుడు పల్లంటి రాంబాబు నాయుడు వెందోటి హరికృష్ణ రెడ్డి పాల్గొన్నారు.

నిరుద్యోగులకు తీవ్ర అన్యాయం: కాంగ్రెస్

ప్రజాశక్తి - గూడూరు టౌన్: కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు దుగరాజ పట్టణం పోర్టు మంజూరు చేసిందని, ఆ తర్వాత వచ్చిన ప్రభుత్వాలు పోర్టు నిర్మాణం విస్మరించి నిరుద్యోగులకు తీవ్ర అన్యాయం చేశాయని మాజీ ఎంపీ చింతామోహన్ పేర్కొన్నారు. గూడూరు పట్టణంలో అశోక్ నగర్ లో కాంగ్రెస్ నాయకులతో కలిసి ఆయన ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ హయాంలో చేసిన అభివృద్ధిని వివరిస్తూ కరపత్రాలు పంచిపెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర విభజన సమయంలో కాంగ్రెస్ దుగరాజపట్నం పోర్టు మంజూరు చేసిందని, ఆ తర్వాత వచ్చిన ప్రభుత్వాలు పోర్టు నిర్మాణాన్ని మరిచిపోవడంతో వేలాది మంది నిరుద్యోగులకు నిరాశ మిగిలిందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా కాంగ్రెస్ గాలి వీస్తోందని, రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ 130 స్థానాల్లో విజయం సాధిస్తుందన్నారు. ఈ ప్రచారంలో మాజీ ఎంపీ కుమార్తె నినా, ఆ పార్టీ జిల్లా అధ్యక్షులు పంటా శ్రీనివాసు లు రెడ్డి, నాయకులు పూల చంద్రశేఖర్, వేమయ్య, నాగభూషణం పాల్గొన్నారు.

'స్పందన' సమస్యలపై స్పందించండి: కమిషనర్

ప్రజాశక్తి -తిరుపతి టౌన్: కార్పొరేషన్‌కి వచ్చే స్పందన సమస్యలను, జగనన్న స్పందన కార్యక్రమానికి వచ్చే సమస్యలను పరిశీలించి ఆయా సమస్యల పరిష్కారానికి కృషి చేసి పని పూర్తి అయినట్లు 'స్పందన' కార్యక్రమానికి అప్ లోడ్ చేయాలని తిరుపతి నగరపాలక సంస్థ కమిషనర్ హరిత అన్నారు. తిరుపతి మునిసిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో శనివారం అన్ని విభాగాల అధిపతులతో ప్రత్యేక సమావేశం కమిషనర్ నిర్వహించారు. జగనన్న స్పందన సమస్యలను, డయల్ యువర్ కమిషనర్, స్పందనలో వచ్చే ప్రజా ఫిర్యాదులను ఆలస్యం కాకుండా పరిష్కరించాలన్నారు. 'ఆడుదాం ఆంధ్ర ' కార్యక్రమంలో విధులు నిర్వహిస్తున్న అధికారులు, సిబ్బంది క్రీడాకారులకు సహాయ సహకారాలు అందించాలన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష రెండవ దశ వైద్య శిబిరాలకు చిక్సితలు అవసరమైన వారిని జనవరి 3 నుండి జూన్ 30వ తేదీ వరకు జరిగే మెడికల్ క్యాంపులకు పంపించేందుకు సచివాలయ కార్యదర్శులు, వాలంటీర్ల సహకారంతో కృషి చేయాలని కమిషనర్ ఆదేశించారు. ఈ సమావేశంలో స్మార్ట్ సిటి జి.ఎం చంద్రమౌళి, రెవెన్యూ అధికారులు కెఎల్‌వర్మ, సేతుమాధవ్, మేనేజర్ చిట్టిబాబు పాల్గొన్నారు.

'ఆసరా' విడుదలపై సమావేశాలు

ప్రజాశక్తి-సదుం: 4 వ విడత ఆసరా నిధులు మంజూరుపై సదుంలో శనివారం నుండీ ఈ నెల 23 వ తేదీ వరకు 18 పంచాయతీలలో జనరల్ బాడీ సమావేశాలు నిర్వహిస్తున్నట్లు వెలుగు ఏపీఎం హరిప్రసాద్ అన్నారు. ఈ సందర్భంగా యర్రాతివారిపల్లి, మొరవపల్లి, చెరుకువారిపల్లి, జోగివారిపల్లి, బూరగమంద, నడిగడ్డ గ్రామాలలో మహిళా సంఘాలతో ఏపీఎం హరిప్రసాద్ శనివారం సమావేశాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ ఎల్లప్ప, జడ్పిటిసి సోమశేఖర్ రెడ్డి, సింగిల్ విండో చైర్మన్ సీఎం తిమ్మారెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు రెడ్డి, జెసిఎస్ ఇన్చార్జి ప్రకాష్ రెడ్డి, నాయకులు మురళి రెడ్డి, కృష్ణారెడ్డి, శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సోమల: మండలంలోని కందూరు గ్రామంలో శనివారం ముందస్తు ఆసరా గ్రామ సభను మహిళా సంఘాలు ప్రజాప్రతినిధులు మధ్య వెలుగు ఆధ్వర్యంలో నిర్వహించారు. గ్రామ సభకు అధ్యక్షత వహించిన సర్పంచి బాషా మసూద్ మాట్లాడుతూ మహిళల ఆర్థిక అభివృద్ధి ప్రభుత్వ ధ్యేయంగా మహిళలకు బ్యాంకు రుణాలు ఇప్పించి తద్వారా వాళ్ల కుటుంబాన్ని అభివృద్ధి పథంలో తీసుకువెళ్లి ఆర్థికంగా ఎదగాలన్న లక్ష్యంతో మహిళా సంఘాల ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో మెకానిక్ భాష, సంఘమిత్రలు, మహిళా సంఘాల మహిళలు పాల్గొన్నారు.

నియోజకవర్గ పోటీలకు ఎంపిక

ప్రజాశక్తి-వికోట: వికోటలో నిర్వహించిన "ఆడుదాం ఆంధ్ర' మండల స్థాయి క్రికెట్ పోటీలలో పాముగానపల్లె సచివాలయం టీమ్ విజేతగా నిలిచింది. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడామైదానంలో గత కొద్దిరోజులుగా నిర్వహించిన క్రికెట్ మండల స్థాయి పోటీలలో శనివారం నిర్వహించిన ఫైనల్ మ్యాచ్‌లో వీకోట అంబేద్కర్ నగర్ సచివాలయం టీంపై, పాముగానిపల్లి సచివాలయం టీం గెలుపొంది నియోజకవర్గ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఎంపీడీవో మహమ్మద్ రఫీ తెలిపారు. విజేతలుగా నిలిచిన టీం కెప్టెన్ విజయ్‌భాస్కర్ రెడ్డితో పాటు ఇతర క్రీడాకారులను, సభ్యులను పలమనేరు ఎమ్మెల్యే వెంకటే గౌడ, జిల్లా పరిషత్ చైర్మన్ శ్రీనివాసులు, ఎంపీపీ యువరాజ్, వైస్ ఎంపీపీ తామీం ఖాన్ అభినందించారు.

గంగాధరనెల్లూరు: మండల స్థాయి పోటీల్లో గంగాధర నెల్లూరుకు చెందిన క్రికెట్ జట్టు గెలుపొందింది. మండల స్థాయి నుండి గెలుపొందిన గంగాధర నెల్లూరు క్రికెట్ జట్టు నియోజకవర్గం స్థాయి పోటీలకు అర్హత సాధించడంతో శనివారం ఎంపీపీ అనిత, ఇన్చార్జి ఎంపీడీవో సుధాకర్, మండల వైస్ ఎంపీపీ హరిబాబు, సర్పంచ్ సుబ్రమణ్యాలు అభినందించారు.

క్రైం కార్నర్

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

ప్రజాశక్తి-గుడిపల్లి: విద్యుదాఘాతానికి గురై వ్యక్తి మృతి చెందిన సంఘటన శనివారం మండలంలోని చిన్నగొల్లపల్లి పంచాయతీ కోడిగానిపల్లిలో చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. కోడిగానిపల్లికి చెందిన శివకుమార్(38) పశువుల షెడ్డులో పనులపై ఉండగా ప్రమాదవశాత్తు విద్యుత్ తీగలు తగిలి షాక్‌కి గురైయ్యాడు. అక్కడే ఉన్న స్థానికులు గుర్తించి హుటాహుటిన ఆసుపత్రికి తరలించారు. అప్పటికే అతను మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. అతని కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు.

అక్రమ మద్యం స్వాధీనం

ప్రజాశక్తి-గంగవరం: అక్రమంగా తరలిస్తున్న కర్నాటక మద్యం స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ ప్రతాప్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం ఆయన విలేకరులకు వివరాలు వెల్లడించారు. చెన్నై-బెంగళూరు రహదారిలోని పత్తికొండ గ్రామం వద్ద శుక్రవారం రాత్రి వాహనాలు తనిఖీ చేపటామన్నారు. మారుతివ్యాన్ తనిఖీ చేయగా 5వేల ఒరిజినల్ ఛాయిస్ టెట్రా ప్యాకెట్లును గుర్తించి నిందితులను, మద్యం, వాహనాన్ని అదుపులోకి తీసుకున్నామన్నారు. నిందితులపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపినట్లు వివరించారు.

ఇక 'ఆన్‌లైన్'లో

ఎంప్లాయిమెంట్ సేవలు : కలెక్టర్

ప్రజాశక్తి -తిరుపతి టౌన్: ఆంధ్రప్రదేశ్ లోని అన్ని జిల్లాల ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజిలు, మోడల్ కెరీర్ సెంటర్లు ఇంటర్నెట్ సెంటర్లు, మొబైల్ ద్వార కూడా పొంద వచ్చని, ప్రస్తుతం అందుతున్న సేవలన్నింటిని భారత ప్రభుత్వ నేషనల్ కెరీర్ సర్వీస్ (ఎన్సీఎస్) పోర్టల్ తో ఆన్లైన్ లోఅనుసంధానించామని కలెక్టర్ వెంకట రమణా రెడ్డి తెలిపారు. అందుకు సంబంధించిన పోస్టర్ ను శనివారం స్థానిక కలెక్టరేట్ కలెక్టర్, ఆవిష్కరించారు. ఈ ఆన్లైన్ సేవలు ఎంప్లాయిమెంట్ రిజిస్ట్రేషన్, రెన్యువల్, అదనపు అర్హతలు నమోదు సులభ రీతిన హెచ్ టి టి పి ఎస్ ://ఎంప్లాయిమెంట్ డాట్ ఏపీ డాట్ జివో వి డాట్ ఇన్ ద్వారా నమోదు చేసుకోవచ్చునని తెలిపారు. అభ్యర్థులు ఆన్లైన్లో దరఖాస్తు చేసుకుంటే వారికి లాగిన్ వివరాలు, తాత్కాలిక రిజిస్ట్రేషన్ నెంబర్ వెంటనే ఎస్సెమ్మెస్ ద్వారా పంపుతారన్నారు. సంబంధిత జిల్లా అధికారి వారి అభ్యర్ధనను ఆమోదించిన తర్వాత వారికి ఎస్సెమ్మెస్ ద్వారా రిజిస్ట్రేషన్ నెంబర్ తెలుపుతారన్నారు. అభ్యర్థులు ఎంప్లాయిమెంట్ కార్డ్ ను లాగిన్ ద్వారా డౌన్లోడ్ చేసుకోవచ్చునని తెలిపారు. సందేహాలకు జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారి ఫోన్ 9441460041 నెంబర్ కు సంప్రదించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ ఆఫీసర్ పెంచల కిషోర్ , సబ్ - ఎంప్లాయిమెంట్ అధికారి, తిరుపతి ఎస్ వెంకట రమణ పాల్గొన్నారు

జొన్నలు, మొక్క జొన్నలు పంపిణీకి సిద్ధం

ప్రజాశక్తి-చిన్నగొట్టిగల్లు: రైతులకు సబ్సిడీపై ఇచ్చేందుకు జొన్నలు, మొక్క జొన్నల విత్తనాలు ఆర్బికేలలో సిద్ధంగా వున్నాయని మండల వ్యవసాయాధికారి ధనలక్ష్మి తెలిపారు. జొన్నలు 5 కేజిలు బ్యాగు రూ.130, మొక్కజొన్నలు 5కేజీల బ్యాగు రూ.100కు ఇస్తున్నా మన్నారు. కావలసిన వారు ఆధార్ కార్డు జిరాక్స్ , వన్ బి లేదంటే పాస్ బుక్ జిరాక్స్ కాపీలతో ఆర్బికేలలోని తమ సిబ్బందిని సంప్రదించాలని తెలిపారు. ఈ ఆవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

బస్సు యాత్రను విజయవంతం చేయాలి: వైసిపి

ప్రజాశక్తి-నాయుడుపేట: నాయుడుపేట నుంచి ఈ నెల 21న ఆదివారం సూళ్లూరుపేట ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య ఆధ్వర్యంలో నిర్వహించే సామాజిక సాధికార బస్సుయాత్రను విజయవంతం చేయాలని తిరుపతి జిల్లా వైసిపి కార్యదర్శి, నాయుడుపేట రూరల్ జెసిఎస్ కన్వీనర్ ఓట్టూరు కిషోర్ యాదవ్, వైసీపీ నాయకులకు, కార్యకర్తలకు, అభిమానులకు శనివారం పిలుపు నిచ్చారు. మండలంలోని ప్రజలు కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, ఎంపీపీ, జడ్పిటిసి, ఎంపిటిసి, సర్పంచులు, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, అభిమానులు, సానుభూతి పరులు అధిక సంఖ్యలో తరలి వచ్చి విజయవంతం చేయాలని కోరారు.

కొత్త వాలంటీర్ల నియామకం

ప్రజాశక్తి- పెళ్లకూరు: పెళ్లకూరు మండలంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ పోలంరెడ్డి శేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో కొత్త వాలంటీర్ల నియామకం శనివారం నిర్వహించారు. పాలచ్చూరు గ్రామానికి సంబంధించి ఓరేపల్లి నాగరత్నమ్మ, పెళ్లకూరు గ్రామానికి మాల్యాద్రి, తాళ్లాయిపాడులో మనుబోలు శివాజీని ఎంపిక చేసి ఎంపీడీవో సురేష్ బాబు చేతుల మీదుగా వారికి నియామక పత్రాలు అందించారు.

25న యస్వీయూలో ఏపీ లాసెట్, పీజీ లాసెట్ స్పాట్ అడ్మిషన్లు

ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో స్పాట్ అడ్మిషన్ల ద్వారా ఏపీ లాసెట్, ఏపీ పీజీ లా సెట్-2023(ఎల్ ఎల్ యం, యల్ యల్ బి (ఐదు సంవత్సరాలు) కోర్సు చేరదలచిన విద్యార్థులకు ఉన్నత విద్యామండలి మరో అవకాశం కల్పించినట్లు డైరెక్టరేట్ ఆఫ్ అడ్మిషన్స్ డైరెక్టర్ ఆచార్య మురళీ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. యస్వీయూలోని వివిధ లా విభాగంలో వున్న ఖాళీ సీట్లను స్పాట్ అడ్మిషన్ల ద్వారా భర్తీ చేస్తామని పేర్కొన్నారు. ఖాళీలను వెబ్‌సైటులో చూడవచ్చని, ఈ నెల 25వ తేదీ లా సెట్, పీజీ లా సెట్ -2023 సర్టిఫికేషన్ వెరిఫికేషన్ , స్పాట్ అడ్మిషన్స్ నిర్వహిస్తామని డివోఏ డైరెక్టర్ తెలిపారు. ఇప్పటి వరకు సీట్లు పొందని విద్యార్థులు డిఓఏ కార్యాలయంలో తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో రిపోర్టు చేయవచ్చని తెలిపారు. లా సెట్ -2023 సెట్లో ర్యాంకు పొందిన విద్యార్థులు మాత్రమే స్పాట్ అడ్మిషన్లకు అర్హులని, గతంలో రెండు ఫేజ్‌లలో అడ్మిషన్లు పొందిన విద్యార్థులు స్పాట్ అడ్మిషన్లకు అనర్హులని, స్పాట్ అడ్మిషన్ల ద్వారా చేరిన వారికి ఫీజు రీయింబర్సు మెంట్ సౌకర్యం వర్తించదని తెలిపారు. మరిన్ని వివరాలను ఖాళీలను ఎస్వియూనివర్సిటీ. ఇడియు.ఇన్.డిఓడి అనే వెబ్‌సైటు ద్వారా పొందవచ్చని వెబ్ సైట్ ద్వారా పొందవచ్చన్నారు.